కొండారెడ్డిపల్లికి కొత్త శోభ


ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

వంగూరు, కల్వకుర్తి, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి హోదాలో ఎనుముల రేవంత్‌రెడ్డి తొలిసారి స్వగ్రామం కొండారెడ్డిపల్లికి దసరా పండగ రోజు రావటం కొత్త శోభ నెలకొంది. శనివారం మధ్యాహ్నం ప్రత్యేక హెలిప్యాడ్‌లో చేరుకొన్నారు. గజమాలలతో గ్రామస్థులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ప్రత్యేక వాహనంలో రోడ్డు వెంట పూలవర్షం కురిపిస్తూ కోలాటాలు, బతుకమ్మలతో ఊరేగింపుగా తీసుకొచ్చారు. గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. రాష్ట్ర ముఖ్యమంత్రి అయినా గ్రామస్థులు, బంధువులను మర్చిపోకుండా పేరుపేరునా పలుకరించడం ప్రత్యేకతను సంతరించుకుంది. సాయంత్రం 6.30 గంటలకు ఇంట్లో నుంచి సీఎం పంచెకట్టుతో బయలుదేరి ఆయన నిర్మించిన కోటమైసమ్మ ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. కొండారెడ్డిపల్లికి ముఖ్యమంత్రి వస్తున్నారని గ్రామానికి చెందిన ఆడబిడ్డలు, అల్లుళ్లు, బంధువులు రాకతో ఊరంతా జనసందోహంతో కళకళలాడింది. ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ, మాజీ జడ్పీటీసీసభ్యుడు కేవీఎన్‌రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు. అనంతరం గ్రామ యువకులతో స్వీయచిత్రాలు దిగారు.

ఆరు గంటలపాటు సీఎం పర్యటన

ఆరుగంటల పాటు కొండారెడ్డిపల్లిలో ఉండి బంధువులు, గ్రామస్థులు, అభిమానులకు సమయమిచ్చారు. రాత్రి 8.15 గంటలకు ప్రత్యేక వాహనాల్లో కొడంగల్‌కు వెళ్లారు.

రూ. 50 కోట్లతో అభివృద్ధి పనులు..: గ్రామానికి చెందిన వ్యక్తి ఎనుముల రేవంత్‌రెడ్డి రాష్ట్ర ముఖ్య మంత్రి కావటం మా అదృష్టమంటు, కొండారెడ్డిపల్లి ప్రజలు ప్రతి పనిలో బాగస్వాములైయ్యారు. గ్రామంలోని ప్రతి ఇంటిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే కొండారెడ్డిపల్లికి నాలుగు వరుసల రహదారి ఏర్పాటుకు నిధులు మంజూరు చేయటం, నిత్యం జిల్లా అధికారులు గ్రామానికి రాకతో ప్రజల్లో ఆనందాలు తొంగి చూశాయి. రూ.50 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడంతో గ్రామ రూపురేఖలు మారిపోయాయి.


జమ్మి పూజకు గ్రామస్థులతో తరలివెళ్తున్న రేవంత్‌రెడ్డి, పక్కన మల్లు రవి, డా.వంశీకృష్ణ

సుంకేసులకు పెరిగిన వరద

రాజోలి, న్యూస్‌టుడే: ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా సుంకేసుల జలాశయానికి వరద ప్రవాహం పెరిగింది. ఆదివారం ఎగువ నుంచి 44,700 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో 10 గేట్లను ఒక మీటరు మేర ఎత్తి 42,070 క్యూసెక్కుల నీటిని దిగువనున్న శ్రీశైలం జలాశయానికి విడుదల చేస్తున్నట్లుగా డ్యాం అధికారులు తెలిపారు. కర్నూలు వైపున్న కేసీ కాలువకు 2400 క్యూసెక్కులు వదులుతున్నామని, ప్రస్తుతం జలాశయంలో 291.20 మీటర్ల నీటిమట్టం నమోదైనట్లుగా వారు పేర్కొన్నారు.

కమిటీలు సరే.. మరి ఇళ్ల సంగతి?

త్రిశంకు స్వర్గంలో 770 కుటుంబాలు

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: పేదలకు ఇళ్ల కేటాయింపులపై అకస్మాత్తుగా ఇందిరమ్మ కమిటీలు తెరపైకి రావడంతో.. మా సంగతేంటని రెండు పడక గదుల ఇళ్ల లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ప్రకటనకు ముందు జిల్లా కేంద్రంలో నిర్మించిన ఇళ్లకు లాటరీ తీసి లబ్ధిదారులను గుర్తించారు. ఏడాదికిపైగా సమయం గడిచిపోయినా ఇప్పటికీ వాటిని వారికి స్వాధీనం చేయలేదు. మరో వైపు ఇళ్లు దెబ్బతింటున్నాయి.


రెండు పడక గదుల ఇళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్

అంతా సందిగ్ధమే..: తాజా ప్రభుత్వం నిర్ణయం మేర ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుతో రెండు పడక గదుల ఇళ్లను పాత వారికే కేటాయిస్తారా? లేక మరో మారు దరఖాస్తులు స్వీకరించి లాటరీ తీస్తారా? అని లబ్ధిదారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వార్డుల వారీగా సమావేశాలు నిర్వహించి జిల్లా అధికారుల సమక్షంలో లబ్ధిదారులను పారదర్శకంగా లాటరీ తీసి పక్కాగా రికార్డులు తయారు చేశారని, మరోసారి ఆ ప్రక్రియకు అవకాశం లేదని వాదించుకుంటున్నారు.

లాటరీ ఇలా: పుర పరిధిలో దౌదర్‌పల్లి సమీపంలో 1,275 రెండు పడక గదుల ఇళ్లు అందుబాటులో ఉన్నాయి. అయితే గతంలో ఇక్కడ పేదలకు ఇళ్ల నిర్మాణాల కోసం భూమిని సేకరించి పట్టాలు ఇచ్చారు. రెండు పడక గదుల నిర్మాణాల కోసం ఇళ్ల పట్టాలను రద్దు చేయడంతో వారు కోర్టును ఆశ్రయించారు. రద్దు చేసిన తమ పట్టాలకు బదులు ఇళ్లను కేటాయించాలని కోర్టును ఆశ్రయించడంతో 505 ఇళ్లను వారి కోసం రిజర్వు చేశారు. మిగిలిన 770 ఇళ్లను దరఖాస్తుదారుల్లో అర్హులకు కేటాయించడానికి పట్టణంలో ప్రతి వార్డులో వార్డు సభలు ఏర్పాటు చేసి లాటరీ పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేశారు. జిల్లా ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో పారదర్శకంగా లాటరీ తీశారు. 2023 ఏప్రిల్‌లో తీసిన లాటరీలో ఇళ్లు పొందిన వారు అప్పటి నుంచి ఆశగా ఇంటి కోసం ఎదురుచూస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో తమ సొంతింటి కల నెరవేరుతుందో లేదోనని [illegible] వారంటున్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో వీటి గురించి ప్రస్తావించే నాయకుడే కరవయ్యారు. దీనిపై గద్వాల ఆర్డీవో రాంచందర్, పుర కమిషనర్ దశరథను ఫోనులో సంప్రదించడానికి ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

1,300 గృహాలు

గద్వాల నియోజకవర్గంలో 1,300 రెండు పడక గదుల ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. పట్టణ సమీపంలోని దౌదర్‌పల్లిలో మొదటి విడతగా 20 బ్లాకుల్లో 560 ఇళ్ల నిర్మాణాలను చేపట్టి పూర్తి చేశారు. రెండో విడతలో 30 బ్లాకుల్లో 715 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. మొత్తం 1,275 ఇళ్లు నిర్మించారు. దీనికి తోడు మండల పరిధిలో గోనుపాడు గ్రామంలో 25 ఇళ్ల నిర్మాణాలు చేపట్టి పూర్తి చేశారు. వీటి కేటాయింపులకు నిరుపేదల నుంచి రెండు దఫాలుగా దరఖాస్తులు స్వీకరించారు. మొదటి దశలో 4,160, రెండో దశలో 989 దరఖాస్తులు వచ్చాయి. ఈ నేపథ్యంలో వార్డు సభలను ఏర్పాటు చేసి అర్హుల జాబితాను తయారు చేశారు. ఎస్సీ, ఎస్టీ, వికలాంగులు, విశ్రాంత సైనికులకు రిజర్వేషన్లు వర్తింప చేశారు.

ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు

గద్వాల జిల్లాలో నిబంధనలు హుష్

ఈనాడు, మహబూబ్‌నగర్

మహారాష్ట్రలోని అక్కల్‌కోట నుంచి చెన్నై వరకు నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి పనులు జోగులాంబ గద్వాల జిల్లాలో 77.5 కిలోమీటర్ల మేరకు సాగుతున్నాయి. ఈ పనుల కోసం కేంద్రం రూ.1,568 కోట్లు కేటాయించింది. పనుల్లో భాగంగా మొరం మట్టిని వాడాలి. ప్రస్తుతం వడ్డేపల్లి మండలంలో పనులు కొనసాగుతున్నాయి. జూలకల్ ప్రాంతంలో కొన్ని ఎకరాల్లో వ్యవసాయ భూములను మొరం మట్టి పేరుతో ఇష్టారాజ్యంగా తవ్వేశారు. ఇందులో భాగంగా [illegible] ఉన్న ఓ గుట్టను చెరపట్టారు. ఆర్డీఎస్ కాలువ వెంట ఉన్న పలు భూములను జేసీబీ, పొక్లెయిన్లు, టిప్పర్లు పెట్టి 10 అడుగులకుపైగా గుంతలు తీస్తున్నారు. ఇటీవల పడిన వర్షాలతో ఈ ప్రాంతాల్లో కొత్త చెరువులు పుట్టుకొచ్చాయి.


ఈ చిత్రంలో కనిపిస్తున్నది చెరువనుకున్నారా? అయితే భ్రమ పడినట్లే. అచ్చం చెరువును తలపిస్తున్న ఈ ప్రాంతం ఏడాది క్రితం వరకు సాగు భూమి. కొన్ని ఎకరాల్లో ఉన్న ఈ భూమి చెరువులా ఎలా మారిందని అనుకుంటున్నారా. మొరం మట్టి తవ్వడంతో ఇలా తయారైంది. వడ్డేపల్లి మండలం జూలకల్‌లోని ఆర్డీఎస్ కాలువకు సమీపంలోని భూములను ఈ ప్రాంతంలో చేపడుతున్న భారత్‌మాల రహదారి కోసం తవ్వారు. ఇక్కడ పట్టా, సీలింగ్ భూముల్లో ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరపడంతో ఎకరాలు ఎకరాలు చెరువులను తలపిస్తున్నాయి. సుమారు 10 అడుగుల లోతు వరకు భూమిని తవ్వి మొరం తరలించారు.


ఈ చిత్రంలో కనిపిస్తున్నది వడ్డేపల్లి గుట్ట. దీనిపై మాధవ స్వామి ఆలయం కూడా ఉంది. ఒక్కప్పుడు 25 ఎకరాలకుపైగా ఈ గుట్ట విస్తరించి ఉండేది. జాతీయ రహదారి కోసమని అనుమతుల పేరుతో ఇష్టారాజ్యంగా తవ్వారు. ప్రస్తుతం 25 ఎకరాల గుట్ట పూర్తిగా మాయమయ్యే పరిస్థితి వచ్చింది. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరపడంతో జిల్లాలోనే ఎంతో గుర్తింపు ఉన్న ఈ గుట్ట ప్రస్తుతం మాయమయ్యే పరిస్థితి వచ్చింది.

● వడ్డేపల్లి గుట్ట మాయమవుతోంది. ఇక్కడ మాధవస్వామి ఆలయం ఉంది. ఇక్కడి నుంచి కొన్ని లక్షల టన్నుల్లో మొరం మట్టిని తరలించారు. ఇక్కడి గుట్టను ఇష్టారాజ్యంగా తవ్వడంపై

యడం లేదు. బుడమర్సు, తనగలలోని గుట్టలను కూడా యథేచ్ఛగా తవ్వుతున్నారు. ఈ రెండు గ్రామాల్లోని ప్రధాన గుట్టలను ఖాళీ చేస్తున్నారు.

కిమ్మనని యంత్రాంగం : నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుగుతున్నా నాయకులు, అధికార యంత్రాంగం నోరెత్తడం లేదు. నియోజకవర్గంలో కీలకంగా ఉన్న కొందరు వ్యక్తులు చేయితడుపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. జరిమానాలు విధించాల్సిన భూగర్భ గనుల శాఖ అధికారులు పైపై చెకింగులు చేస్తున్నా అన్నీ ప్రకటనలకు, కాగితాలకే పరిమితం. సాధారణంగా టన్ను మొరం మట్టికి రూ.35, రాళ్లకు రూ.80 వరకు సీనరేజ్ చార్జీలు చెల్లించాలి. గతంలో శాంతినగర్, కేటీదొడ్డి మండలాల్లో తవ్వకాలు జరిగినపుడు విచారణ చేపట్టి హోలోగ్రామ్ ఆధారంగా లెక్కలు తేల్చడంతో సుమారు రూ.56కోట్ల వరకు జరిమానాలు విధించి అధికారులు చేతులు దులుపుకున్నారు. దీనిపై జోగులాంబ గద్వాల జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) లక్ష్మీనారాయణను 'ఈనాడు' సంప్రదించగా క్షేత్రస్థాయికి అధికారులను పంపించి విచారణ చేయిస్తామని తెలిపారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: పట్టణంలో వివిధ ప్రాంతాల్లోని ఇనుప స్తంభాలను మార్చడానికి సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నామని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ టౌన్ - 1 ఫీడర్ పరిధిలోకి వచ్చే రాఘవేంద్ర కాలనీ, మోమీన్ మహిల్లా, రాయచూర్ రోడ్డు, తెలుగుపేట, కుంట వీధి, తేరుమైదానం, వడ్లవీధి, చేపల మార్కెట్, బీసీ కాలనీ, షేరెల్లి వీధులలో సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. మోమీన్ మహిల్లాలో పాత ట్రాన్స్‌ఫార్మర్ ప్లింత్‌ను మార్చడానికి ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా నిలిపేస్తున్నామని వినియోగదారులు సహకరించాలని అధికారులు కోరారు.

ఇక మెరుగైన పౌష్టికాహారం

- 312 ప్రభుత్వ పాఠశాలల్లో మంచి భోజనం
- సీఎం నియోజకవర్గంలో పైలెట్ ప్రాజెక్టు

న్యూస్‌టుడే, కోస్గి

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే కాకుండా, విద్యార్థులకు మరింత మెరుగైన పౌష్టికాహారాన్ని అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. చాలా పాఠశాలల్లో మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించడంలేదనే విమర్శలు ప్రస్తుతం ఉన్నాయి. ఈ క్రమంలో విద్యార్థులకు ఒకేచోట నాణ్యమైన భోజనాన్ని తయారుచేసి అన్ని పాఠశాలలకు అందించాలని, దీంతో విద్యార్థులందరికీ బలవర్ధకమైన పౌష్టికాహారం అందుతుందని భావించారు. పైలెట్ ప్రాజెక్టుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌ని ఎంపిక చేశారు. నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుకుంటున్న విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించనున్నారు. ఇందుకోసం అక్షయపాత్ర సంస్థ బాహుబలి వంటషెడ్‌ను కొడంగల్ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెలాఖరుకు దీని నిర్మాణం పూర్తిచేసి, విద్యార్థులకు భోజనం అందించాలని అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఈ నియోజకవర్గంలో విజయవంతమైతే రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్నారు. వంటగది నిర్మాణానికి రూ.4 కోట్లు వెచ్చించనున్నారు. హరేరామ హరేకృష్ణ ఫౌండేషన్ రూ.2 కోట్లు, సీఎస్ఆర్ ఫౌండేషన్ రూ.2 కోట్లు వెచ్చిస్తోంది. ఇప్పటికే నిర్మాణం ఒక కొలిక్కి వచ్చింది. కొంతమేర సామగ్రి సైతం చేరుకుంది. పనులను వేగంగా పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని అధికారులు యోచిస్తున్నారు.




కొడంగల్‌లో నిర్మిస్తున్న భారీ వంటశాల

● కొడంగల్ నియోజకవర్గం పరిధిలో నారాయణపేట జిల్లాలోని కోస్గి, మద్దూరు, గుండుమాల్, కొత్తపల్లి మండలాలు, వికారాబాద్ జిల్లాలోని కొడంగల్ దౌల్తాబాద్, బొంరాస్‌పేట, దుద్యాల మండలాలు ఉన్నాయి. మొత్తం 312 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కొడంగల్ నుంచి మధ్యాహ్న భోజనంతో పాటు అల్పాహారం అందించనున్నారు. 28 వేల మంది విద్యార్థులకు ప్రయోజనం కలగనుంది. ఈ నెలాఖరు నుంచి కొత్త మెనూప్రకారం భోజనం అందిస్తామని కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి 'న్యూస్‌టుడే'తో అన్నారు.

సమస్యలపై సమష్టిగా పోరాడుదాం


మాట్లాడుతున్న అఖిలపక్ష కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులు

అయిజ, న్యూస్‌టుడే: అయిజ మండలంలో ప్రజలను పట్టిపీడిస్తున్న సమస్యల పరిష్కారానికి సమిష్టిగా పోరాడుదామని అఖిలపక్ష కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులు పేర్కొన్నారు. ఆదివారం అయిజలోని అఖిలపక్ష కమిటీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అయిజ పెద్దవాగుపై నిర్మించిన వంతెనపై పలుమార్లు ధర్నా చేసి సాధించామని తెలియజేశారు. దీని మాదిరిగానే ప్రస్తుతం ఉన్న సమస్యలైన పట్టణంలో అసంపూర్తిగా ఉన్న 30 పడకల ఆస్పత్రి భవనం నిర్మాణం, పులికల్ రహదారి అభివృద్ధి, పట్టణంలో వాహనాల రద్దీని క్రమబద్ధీకరించడంపై పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. విడతల వారీగా సమస్యలపై అధికారులను నిలదీద్దామని ఆయన పిలుపునిచ్చారు. కమిటీ నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, ఆంజనేయులు, జగపతిరెడ్డి, డా.తాహేర్, కృష్ణ, ప్రభాకర్, రంగు మద్దిలేటి, మారెప్ప, జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.

దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించండి


మానవపాడు, న్యూస్‌టుడే: చిన్నపోతులపాడులో ఈ నెల 10న ప్రశాంతమ్మ అలియాస్ ఎస్తేరమ్మపై దాడికి పాల్పడిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని నాయకులు డిమాండు చేశారు. ఎమ్మార్పీఎస్ తాలుకా ఇన్‌ఛార్జి జయరాజు, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మల్దకల్, తెలంగాణ ఉద్యమ నాయకుడు దుబ్బన్న ఆధ్వర్యంలో పలువురు నాయకులు మానవపాడు ఠాణా ముందు శనివారం ధర్నా చేశారు. ప్రశాంతమ్మ ఇంటి వద్ద బజ్జీల వ్యాపారం చేసుకుంటున్న క్రమంలో యుగంధర్ అక్కడకు వచ్చి అసభ్యంగా మాట్లాడి వేడి నూనెతో ఆమెపై దాడి చేశారని, బాధితురాలు ఆసుపత్రిలో చికిత్సపొందుతోందని నాయకులు పేర్కొన్నారు. యుగంధర్, ఆయనకు సహకరించిన మరో ఇద్దరిని శిక్షించాలని కోరారు. విషయం తెలుసుకున్న శాంతినగర్ సీఐ టాటాబాబు మానవపాడు ఠాణాకు చేరుకుని దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలపడంతో ధర్నా విరమించారు. దాడి ఘటనపై బాధితురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మానవపాడు ఎస్సై చంద్రకాంత్ తెలిపారు.


ఠాణా ముందు ధర్నా చేస్తున్న నాయకులు, గ్రామస్థులు

ఎమ్మెల్యే ఖండించాలి: నియోజకవర్గంలో దళితులపై జరుగుతున్న దాడులను ఎమ్మెల్యే విజయుడు ఖండించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కోరారు. కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎస్తేరమ్మను పరామర్శించారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని మానవపాడు ఠాణాలో వినతిపత్రం అందజేశారు. నాయకులు రాజు, దేవదాసు, జీకే.ఈదన్న, రమేష్, మధు, పరంజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.


ఆసుపత్రిలో బాధితురాలిని పరామర్శిస్తున్న నాయకులు

పది మొక్కల లక్ష్యం.. ఇచ్చింది ఫలితం





ధరూరు ఉన్నత పాఠశాల ఆవరణలో పచ్చదనం

ఏపుగా పెరిగిన మొక్కలు

ధరూరు, న్యూస్‌టుడే: ఇంట్లో నుంచి బయటకు వెళ్తే తిరిగి ఇంటికి వచ్చే లోపు కరోనా మహమ్మారి ఎక్కడ కబళిస్తుందోనన్న భయంతో బతుకుతున్న రోజులు.. ధరూరు పాఠశాల ఉపాధ్యాయలదీ అదే పరిస్థితి. రోజూ 1,150 మంది విద్యార్థుల మధ్య తిరుగుతూ నిత్యం కళకళలాడే పాఠశాల బోసిపోయిన తీరు. ఆ సమయంలో ఏదీ తోచని ఉపాధ్యాయులకు ఓ చక్కటి ఆలోచన చేశారు. ప్రధానోపాధ్యాయుడికి వివరించి ఆయన నిర్ణయంతో అడుగు ముందుకేశారు. గ్రామ మాజీ సర్పంచి సహకారంతో పాఠశాలలో మొక్కలు నాటి వాటి సంరక్షణ చర్యలకు శ్రీకారం చుట్టారు.

ఉపాధ్యాయులే తలా ఇంత పోగేసి దాతల సహకారంతో రూ.లక్ష వరకు వెచ్చించి కడియం నర్సరీ నుంచి ప్రత్యేకంగా మొక్కలు తెప్పించారు. తలా పది మొక్కలు దత్తత తీసుకొని కరోనా అంతరించి పోయి పాఠశాలలు తెరిచే దాకా సంరక్షిస్తూ నీరందించారు. ఎవరికి వారు తాము దత్తత తీసుకున్న పదిమొక్కల పెంపకం పూర్తి బాధ్యతలు ఇప్పటికీ నిర్వర్తిస్తూ వస్తున్నారు. రెండేళ్లు గడిచే సరికి పాఠశాల పచ్చదనపు కళతోపాటు చల్లదనాన్ని, స్వచ్ఛమైన గాలినీ ఇస్తోంది. చెట్లను చూస్తే తృప్తిగా అన్పిస్తుందని ఉపాధ్యాయులంటున్నారు.



హంస వాహనంపై జలవిహారం



అలంకరణలో ఉత్సవమూర్తులు



నదిహారతులు ఇస్తున్న అర్చక స్వాములు

వైభవం..జోగులాంబ తెప్పోత్సవం!

అలంపూర్, న్యూస్‌టుడే: శక్తి పీఠంలో దసరా ఉత్సవాలు విజయ దశమితో ముగిశాయి. ముగింపు సందర్భంగా శనివారం తుంగభద్ర నదిలో తీర్థవలి నిర్వహించారు. దేవతమూర్తుల విగ్రహాలతో పాటుగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. రాత్రి హంస వాహనంపై తెప్పోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. దేవతామూర్తులు ఆహ్లాదకరమైన వాతావరణంలో నదిలో విహరించారు. తిలకించేందుకు వేల సంఖ్యలో భక్తులు తరలి రావడంతో పుష్కర్‌ఘాట్ కిక్కిరిసిపోయింది. ఉత్సవం సందర్భంగా నదీ హారతి ఇచ్చారు. కలెక్టర్ సంతోష్ దంపతులు, ఎమ్మెల్యే విజయుడు, ఈవో పురేందర్, ఆలయ ఛైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. పూర్ణాహుతి కార్యక్రమంతో ఉత్సవాలను ముగించారు. 108 రకాల సుగంధ ద్రవ్యాలు, వన మూలికలు, పట్టువస్త్రాలు ఆహుతి ఇచ్చారు. ధ్వజావరోహణ కార్యక్రమం నిర్వహించారు. హంసవాహనంలోకి కేవలం కలెక్టర్ దంపతులు, ఎమ్మెల్యే, ఆలయ ఛైర్మన్‌కు మాత్రమే అవకాశం కల్పించారు. ధర్మకర్త సభ్యులు వెళ్తుండటంతో పోలీసులు అడ్డుకున్నారు. తమకే అవకాశం కల్పించకపోతే ఎలా అంటూ వారు ఆవేదన వ్యక్తం చేశారు.



భక్తజనంతో కిక్కిరిసిన పుష్కర్‌ఘాట్



మూర్తులకు పుణ్యస్నానాలు



ఆలయంలో భక్త జనసందోహం

ప్రభుత్వ గోదాముల్లోనే ధాన్యం నిల్వ!

ధరూరు, మల్దకల్, న్యూస్‌టుడే: రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం మిల్లులకు తరలించటం వాటిని కస్టం మిల్లింగ్ చేసిన తర్వాత తిరిగి ప్రభుత్వానికి అప్పగించటంలో అనేక లోపాలు, అక్రమాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇక మీదట రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం నేరుగా ప్రభుత్వ గోదాములకు తరలించి నిల్వ చేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ చేసిన ప్రతిపాదనలకు వ్యవసాయ శాఖ ఆమోదం తెలిపింది. త్వరలోనే దీనికి సంబంధించి ఉత్తర్వులు వెలువడనున్నట్లు తెలిసింది.



కుర్తిరావల్ చెర్వు వద్ద నిర్మించిన 5 వేల మెట్రిక్ టన్నుల ప్రభుత్వ గోదాం

గతంలో ఇలా

వరి ధాన్యం నేరుగా మిల్లులకే కేటాయించటం కస్టమ్ మిల్లింగ్ ద్వారా తిరిగి వారి నుంచి బియ్యంను తీసుకోవటం చేశారు. ఈ ఏడాది మిల్లర్లు పలు డిమాండ్లను ప్రభుత్వం ముందుంచటంతో పాటు మార్గదర్శకాల్లో మార్పులు చేయాలని పట్టుబట్టుతుండటంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ప్రభుత్వం నిర్ణయం వెనక మరో అంశం కూడా ఉన్నట్లు సమాచారం. గతంలో మిల్లులు కేటాయించిన ధాన్యాన్ని మిల్లర్లు బహిరంగ మార్కెట్‌కు తరలించి అమ్ముకోవటం వాటి స్థానంలో పీడీఎస్ లేదా ఇతర చోట్ల నుంచి సేకరించిన బియ్యం ప్రభుత్వానికి ఇవ్వడం జరిగింది. కొన్ని మిల్లుల నిర్వాహకులు ధాన్యం నిల్వలను పక్కదారి పట్టించి బియ్యం ఇవ్వలేక బకాయిపడ్డారు. వారిపై క్రిమినల్ కేసులు నమోదు, ఆస్తుల జప్తునకు కలెక్టర్లు చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే.

అవసరమున్న మేరకే మిల్లింగ్

కొనుగోలు చేసిన ధాన్యం వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలో ఉన్న గోదాములు, స్టేట్ వేర్ హౌసింగ్ గోదాముల్లో నిల్వ చేయనున్నారు. అయితే ఇప్పటికే వాటిని ఇతరులకు లీజుకు ఇచ్చి ఉంటే వాటిని ఖాళీ చేయించి వరి ధాన్యం నిల్వకు ఉపయోగించనున్నారు. జిల్లాలు, మండలాల వారీగా వచ్చే ధాన్యాన్ని సమీపంలో వ్యవసాయ శాఖ గోదాములకు తరలించి నిల్వ చేస్తారు. రైసు మిల్లర్లతో సమస్య పరిష్కారం అయిన తర్వాత వారికి కేటాయించే అవకాశం ఉంది. ధాన్యం మిల్లులకు కేటాయింపుల్లో కూడా ఈసారి మార్పులు చోటుచేసుకోనున్నట్లు తెలిసింది. సంక్షేమ పథకాలకు అవసరం ఉన్న మేర మాత్రమే మిల్లింగ్ చేయించి మిగిలిన వరిధాన్యం బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నట్లు సమాచారం.



నేటికి మంచి రోజులు

గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉన్న చోట మండలానికి 5వేల మెట్రిక్ టన్నులు, సాగువిస్తీర్ణం ఎక్కువగా ఉన్నచోట 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న గోదాములను నిర్మించారు. వాటిలో చాలా వరకు వినియోగంలోకి రాలేదు. గట్టు, కేటీదొడ్డి మండలాల పరిధిలో 10వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యమున్న గోదాములు ఐదేళ్లుగా వృథాగా ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో అప్పట్లో 65 మండలాల పరిధిలో గోదాములు నిర్మించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ శాఖ పరిధిలో ఉన్న గోదాముల్లో 4.50 లక్షల టన్నుల సామర్థ్యం ఉన్న గోదాములు అందుబాటులో ఉన్నాయి. అలాగే వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలో మొత్తం 17 చోట్ల దాదాపు 2లక్షల టన్నుల నిల్వ సామర్థ్యం ఉన్న గోదాములున్నాయి. జోగులాంబ జిల్లాలోనే 8 మండలాల పరిధిలో 55 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యమున్న గోదాములున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 16.25 లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్యం దిగుబడి రానుందని అంచనా. దీనికి అనుగుణంగా నిల్వకు ఇటు వ్యవసాయ శాఖ అటు పౌరసరఫరాల శాఖ సంయుక్తంగా ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది.

తుంగభద్రలో భారీగా పెరుగుతున్న ప్రవాహం



ఆర్డీఎస్ వద్ద తుంగభద్ర పరవళ్లు

శాంతినగర్, న్యూస్‌టుడే: తుంగభద్ర నదిలో ఆదివారం ప్రవాహం భారీగా పెరిగింది. జలాశయం ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు పడుతుండటంతో దాని నుంచి 80 వేల క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. జలాశయం దిగువన నదీపరివాహక ప్రాంతాల్లో పడుతున్న వర్షాలకు మరో 17,880 క్యూసెక్కులు, మొత్తం 97,880 క్యూసెక్కుల ప్రవాహం ఆర్డీఎస్ ఆనకట్టకు వద్ద ఉంది. ఇది మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం ఆనకట్ట వద్ద 12.8 అడుగుల ఎత్తులో నీటిప్రవాహం ఉన్నట్లు ఏఈ రాందాస్ తెలిపారు. ప్రధానకాల్వకు 8.5 అడుగుల నీటిని విడుదల చేస్తుండగా, రాష్ట్రానికి వచ్చేసరికి అది 5.2 అడుగులుగా ఉంది.

మాంసం ముక్క గొంతులో ఇరుక్కొని రైతు మృతి



కాకి వెంకటన్న

మదనాపురం, న్యూస్‌టుడే : మాంసం ముక్క గొంతులో ఇరుక్కుని శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఏర్పడి ఓ రైతు మృతి చెందారు. వనపర్తి జిల్లా మదనాపురం మండలం కొన్నూరు గ్రామానికి చెందిన రైతు కాకి వెంకటన్న (52) దసరా కనుమ పండగ సందర్భంగా ఆదివారం ఉదయం ఇంటికి మాంసం తెచ్చుకున్నారు. 10 గంటల సమయంలో అన్నం తింటుండగా మాంసం ముక్క గొంతులో ఇరుక్కుంది. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఏర్పడి అస్వస్థతకు గురయ్యారు. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స కోసం కొత్తకోటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు.

జాతీయ స్థాయి టార్గెట్‌బాల్ పోటీలకు ఎంపిక

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే : జాతీయస్థాయి అండర్-19 టార్గెట్‌బాల్ టోర్నీలో పాల్గొనే తెలంగాణ బాల,బాలికల జట్లకు ఉమ్మడి జిల్లా నుంచి ఆరుగురు ఎంపికయ్యారు. నవాబుపేట మండలం సిద్దోటంకు చెందిన ఎస్.కృష్ణ, కోయిలకొండ మల్కాపూర్‌కు చెందిన కె.నవీన్, కోయిలకొండ మండలం పారుపల్లిలోని శ్వేత విద్యామందిర్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సుమిత్ర, నాగలక్ష్మి, కేదారేశ్వరి, పి.రాంచరణ్‌లు బాల,బాలికల జట్లకు ఎంపికయ్యారు. జూనియర్స్ టోర్నీ బిహార్‌లోని రాంసహాయ్ ఛాప్రాలో ఈనెల 16 నుంచి 19వ తేదీ వరకు నిర్వహిస్తున్నారు. క్రీడాకారులను టార్గెట్‌బాల్ సంఘం సభ్యులు ఉమామహేశ్, శీనయ్య తెలిపారు.

500 మిలియన్ యూనిట్లకు చేరిన విద్యుదుత్పత్తి

ఆత్మకూరు, న్యూస్‌టుడే : జూరాల జలాశయం వద్ద వరద ఉధృతి కొనసాగుతున్న క్రమంలో ప్రస్తుత వర్షాకాలం ఎగువ, దిగువ కేంద్రాల్లో ఉత్పత్తి 500.600 మిలియన్ యూనిట్లకు చేరింది. ప్రాజెక్టుకు 42 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా విద్యుదుత్పత్తికి 37,267 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గత 24 గంటల్లో ఎగువన ఐదు యూనిట్ల ద్వారా 3.143, దిగువన ఆరు యూనిట్ల ద్వారా 3.493 మిలియన్ యూనిట్ల మేరకు ఉత్పత్తి జరిగింది. ప్రస్తుత సీజన్‌లో ఎగువన 261.142, దిగువన 239.458 మిలియన్ యూనిట్లకు ఉత్పత్తి చేరిందని ఎస్ఈ జెన్‌కో (ఓఅండ్ఎం) సూరిబాబు తెలిపారు.

సమాజహితాన్ని కోరిన సాయిబాబా

పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి



మహబూబ్‌నగర్: తెలంగాణ కూడలిలో సాయిబాబా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎం.రాఘవాచారి, తదితరులు

పాలమూరు, న్యూస్‌టుడే: సమాజ మార్పుకై, భవిష్యత్తు తరాల కోసం జీవితాన్ని అంకితం చేసిన ఘనత ఆచార్య సాయిబాబాకే దక్కిందని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.రాఘవాచారి అన్నారు. ఈ మేరకు ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం తెలంగాణ కూడలిలో సాయిబాబా సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గత 15 రోజుల నుంచి తీవ్ర అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 12వ తేదీ రాత్రి చనిపోయారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పదేళ్ల నుంచి ఆయనపై అక్రమ కేసులు పెట్టి హింసకు గురి చేసిందని విమర్శించారు. సాయిబాబా 9 ఏళ్ల పాటు ఒంటరిగా జైల్ జీవితం అనుభవించారని చెప్పారు. కారాగారంలో సరైన చికిత్స అందించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారని అన్నారు. జైలు శిక్షలో ఉండగానే మహారాష్ట్ర హైకోర్టు సాయిబాబాను నిర్దోషిగా ప్రకటించిందన్నారు. టీఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం ఖలీల్, డీటీఎఫ్ నాయకులు ఆదిత్య, వెంకటేశ్వర్లు, నాగభూషణం, వామన్‌కుమార్, తెలంగాణ ప్రజా ఫ్రంట్ నాయకులు మన్నెం కొండ, పాలమూరు అధ్యయన వేదిక నాయకులు తిమ్మప్ప, కేసి వెంకటేశ్వర్లు, ఉదయమిత్ర తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబీకుల ఆందోళన



బాలానగర్: రోడ్డుపై ధర్నా చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు

బాలానగర్, న్యూస్‌టుడే: మండలంలోని మొదంపల్లి గ్రామానికి చెందిన స్వామి(25) శుక్రవారం రాత్రి టిప్పర్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన విషయం విదితమే.. దీంతో బాధితుడి కుటుంబ సభ్యులు తమకు న్యాయం చేయాలంటూ మండల కేంద్రంలో జాతీయ రహదారిపై శనివారం ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో 2 గంటలకు పైగా ట్రాఫిక్ జామ్ నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్పందించిన సీఐ నాగార్జున గౌడ్, ఎస్సై తిరుపాజీ టిప్పర్ డ్రైవర్‌పై చట్టపరంగా చర్యలు తీసుకుని న్యాయం చేస్తామని చెప్పడంతో ధర్నా విరమించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు టిప్పర్ డ్రైవర్ మంజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపాజీ తెలిపారు.

నాటు వైద్యం వికటించిన ఘటనలో ఇద్దరిపై కేసు

మహబూబ్‌నగర్ నేరవిభాగం: నాటు వైద్యంతో వ్యాధిని నయం చెద్దామనుకున్న వారికి అది వికటించడంతో ఇరువురిపై కేసు నమోదైన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామీణ ఠాణా ఎస్సై విజయ్‌కుమార్ వివరాల ప్రకారం.. పట్టణంలోని ఓ రాజకీయ నాయకుడు కొన్నేళ్ల నుంచి పక్షవాతంతో బాధ పడుతున్నారు. వ్యాధి పూర్తిగా నయం చేస్తామని బాధితుడికి తెలిసిన వ్యక్తి భరోసా కల్పించాడు. దీంతో అతను మరో నాటు వైద్యుడిని తీసుకొచ్చి గత నెల 21వ తేదీన ఇంట్లోనే చికిత్స చేశారు. కాళ్ల నుంచి శరీరమంతా చపాతీల కర్రతో కొట్టి అనంతరం శరీరంపై నాటు మందు వేశారు. దీంతో మరుసటి రోజు ఉదయం శరీరంపై దద్దులు వచ్చి పగలిపోయాయి. ఈ విషయమై నాటు వైద్యం చేసి వెళ్లిన వారికి సమాచారం అందించగా వారు రాలేదు. దీంతో గత నెల 30న బాధితుడు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


కాల్వలోకి వాహనం దూసుకెళ్లి ఒకరు..



మహమ్మద్ బేగం

కందనూలు, న్యూస్‌టుడే : పత్తి తీయడానికి కూలీ పనులకు వెళ్తూ ఒకరు దుర్మరణం చెందగా మరో 12 మందికి తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... నాగర్‌కర్నూల్ మండలంలోని మంతటికి చెందిన 13 మంది కూలీలు అదే గ్రామ శివారులోని సర్వసతీ ఆలయ సమీపంలోని ఓ రైతు పొలంలో పత్తితీతకు వాహనంలో బయలుదేరారు. ప్రధాన రహదారి నుంచి పొలంలోకి వెళ్తుండగా వాహనం అదుపు తప్పి పక్కనే ఉన్న కేఎల్ఐ కాలువలోకి దూసుకెళ్లి బోల్తాపడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న మహమ్మద్ బేగం (45) అక్కడికక్కడే మృతి చెందగా మరో 12 మందికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి క్షతగ్రాతులను 108 వాహనంలో పట్టణంలోని జనరల్ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ప్రమాదంలో మృతి చెందిన మహిళ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఆర్థిక సాయం అందజేస్తామని పేర్కొన్నారు. మహమ్మద్ బేగం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోవర్ధన్ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు..



జానకి రాములు

లింగాల, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం పద్మన్నపల్లిలో శనివారం రాత్రి చోటు చేసుకోంది. బంధువుల కథనం ప్రకారం.. రైతు పులిపాటి జానకి రాములు (60) శనివారం రాత్రి మొక్కజొన్న పంట కాపలా కోసం వెళ్తుండగా ప్రమాదవశాత్తు వ్యవసాయ బోరు తీగ కాలుకు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా విద్యుదాఘాతానికి గురై జానకిరాములు మృతి చెందినట్లు గుర్తించారు. భార్య, మగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

చెక్‌డ్యాంలో పడి బాలుడు..

తాడూరు, న్యూస్‌టుడే : తాడూరు శివారు కొమ్ముగుట్ట సమీపంలోని చెక్‌డ్యాంలో ఆదివారం మధ్యాహ్నం బర్రెలను నీళ్లు తాగించేందుకు వెళ్లిన 11ఏళ్ల ఓ బాలుడు ప్రమాదవశాత్తు నీటిలోపడి మునిగిపోయాడు. గమనించిన చుట్టు పక్క రైతులు అక్కడి చేరుకొని నీటిలో నుంచి బయటికి తీయగా బాలుడు అప్పటికే మృతి చెందాడు.

వేడి నూనెలో పడి చిన్నారికి తీవ్ర గాయాలు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దినేశ్

వెల్దండ గ్రామీణం, న్యూస్‌టుడే: వేడి నూనెలో పడిన తొమ్మిదేళ్ల బాలుడికి తీవ్ర గాయాలైన ఘటన వెల్దండ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. దసరా పండుగ సందర్భంగా శనివారం ఉదయం వెల్దండలోని పాండు ఇంట్లో పిండి వంటలు చేశారు. భార్య పావని బాండీలో నూనెను అలాగే ఉంచారు. కుమారుడు చిన్నారి దినేష్ ఆడుకుంటూ అటుగా వచ్చి తగలడంతో బాండీలోని నూనెంతా కింద ఒలికింది. అందులోనే బాలుడు జారి పడటంతో ఒళ్లంగా తీవ్రంగా కాలింది. కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

దంపతుల మరణానికి కారణమైన వ్యక్తిపై కేసు

రేవల్లి(గోపాల్‌పేట), న్యూస్‌టుడే : వేరుసెనగ పైరును అడవి జంతువుల నుంచి కాపాడుకునేందుకు పొలం చుట్టూ విద్యుత్తు కంచె ఏర్పాటు చేసి ఇద్దరు వ్యక్తుల ప్రాణాలు పోవడానికి కారణమైన శానాయిపల్లి గ్రామానికి చెందిన బుడ్డ బాలయ్యపై కేసునమోదు చేశామని రేవల్లి ఎస్సై రాము తెలిపారు. రేవల్లి మండలంలోని కొత్తబండరావిపాకుల గ్రామానికి చెందిన బక్కన్న, నారమ్మ దంపతులు ఈనెల 11వ తేదీన సాయంత్రం సీతాఫలాలు తెంచుకుని రావడానికి శానాయిపల్లి గుట్టపైకి వెళ్లి తిరిగి వస్తుండగా గ్రామ శివారులో వేరుసెనగ పైరుకు రక్షణగా పెట్టిన విద్యుత్తు కంచె తగిలి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. శానాయిపల్లి, కొత్తబండరావిపాకుల గ్రామాల్లో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పాన్‌గల్ ఎస్సై శ్రీనివాసులు, రేవల్లి ఎస్సై రాము సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. మృతుల కుమారుడు కాశీం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శనివారం మృతదేహాలకు రేవల్లి ఆసుపత్రిలో పోస్టుమార్టం చేయించినట్లు పోలీసులు తెలిపారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	126–00
రిటైల్	148–00
డ్రెస్డ్	215–00
స్కిన్‌లెస్	244–00

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ॥ 10 గం. నుంచి మ॥ 1 వరకు

గద్వాల గ్రామీణం : 9052211532 | అలంపూర్ : 8008573916
అయిజ : 8008573922 | అలంపూర్ పట్టణం : 8008573930

సమస్య: తుమ్మిళ్లలోని పంచాయతీ భవనం ఇరుగ్గా ఉంది. శిథిలావస్థకు చేరింది. -మధు, గ్రామస్థుడు

పరిష్కారం: నూతన భవన నిర్మాణానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తాం. -ఖాజామొహినుద్దీన్, ఎంపీడీవో

-న్యూస్‌టుడే, రాజోలి

తెరపై ఈనాడు

గద్వాల ఎస్వీసీ సినిమాస్.. దేవర, వేట్టయన్ ద హంటర్, విశ్వం, మా నాన్న సూపర్ హీరో, మార్టిన్, జనక అయితే గనక, **అయిజ:** శివసాయి : దేవర **భువనేశ్వర్ :** విశ్వం, **మాధవ్ :** వేట్టయన్ ద హంటర్

-న్యూస్‌టుడే, గద్వాల గ్రామీణం, అయిజ


ఆలయంలో డీజీపీ జితేందర్ దంపతులు

ఆలయాలను దర్శించుకున్న ప్రముఖులు

అలంపూర్, న్యూస్‌టుడే: అలంపూర్ ఆలయాలను దసరా పర్వదిన సందర్భంగా డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ జితేందర్, ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ రమేష్‌రెడ్డి దంపతులు, కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈవో పురేందర్, అర్చకులు, ఛైర్మన్ నాగేశర్‌రెడ్డి, ధర్మకర్త సభ్యులు వారికి స్వాగతం పలికారు.

వైభవంగా రథోత్సవం


హారతులు పడుతున్న మహిళలు

అయిజ, న్యూస్‌టుడే: అయిజలోని కట్టకింద తిమ్మప్పస్వామి ఉత్సవాలు పురస్కరించుకుని శనివారం రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి రథాన్ని అలంకరించారు. ఆలయం నుంచి గద్వాల రహదారి మీదుగా ఆంజనేయస్వామి ఆలయం వరకు రథోత్సవాన్ని నిర్వహించారు. రథాన్ని లాగేందుకు భక్తులు ఉత్సాహం కనబరిచారు. మహిళలు నిండుబిందెలతో స్వాగతం పలుకుతూ హారతులు పట్టారు. ఆలయాన్ని విద్యుత్తు దీపాలతో అలంకరించారు. మహిళలు, చిన్నారులు అధికసంఖ్యలో ఉత్సవంలో పాల్గొన్నారు.

చెన్నకేశవునికి పల్లకిసేవ..

మల్దకల్: ఎల్కూరులో చెన్నకేశవస్వామి ఉత్సవాలు ఆదివారంతో వైభవంగా ముగిశాయి. శనివారం పండుగరోజు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెన్నకేశవస్వామి, శ్రీదేవి, భూదేవి విగ్రహాలకు వేదోక్తంగా పంచామృతాభిషేకం, అలంకరణ, అష్టోత్తరశతనామావళి, మహామంగళహారతులు, సాయంత్రం పల్లకీసేవ ఉత్సవ విగ్రహాలను ఆలయం నుంచి జమ్మిచెట్టు వరకు మంగళవాయిద్యాలతో ఊరేగింపు, శమీ పూజ, ఊంజల సేవ మొదలైన కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం ఆలయంలో పంచామృతాభిషేకాలు, అలంకరణ, మహామంగళహారతి, ఊంజల సేవ నిర్వహించారు. గ్రామప్రజలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఆహ్వానం: ఎస్పీ

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: అక్టోబరు 21 పోలీసు అమరవీరుల సంస్మరణ (ఫ్లాగ్ డే) సందర్భంగా రాష్ట్ర పోలీసు శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్ పోటీలకు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోటీలో పాల్గొనే ఫొటోగ్రాఫర్లు, విద్యార్థులు పోలీసు త్యాగాలు, పోలీసు విధుల్లో ప్రతిభను తెలిపే విధంగా మూడు ఫోటోలు, మూడు నిమిషాల నిడివి ఉన్న వీడియోను తీసి పెన్ డ్రైవ్‌లో లోడ్ చేసి ఈ నెల 20వ తేదీ లోపల జిల్లా ఎస్పీ కార్యాలయ పీఆర్వోకు అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు 8712661828 చరవాణి నంబరుకు సంప్రదించాలని తెలిపారు.

సిలిండర్‌కు మంటలు: తప్పిన ప్రమాదం

మల్దకల్, న్యూస్‌టుడే: అమరవాయి బస్టాండులోని తెలుగు కృష్ణ హోటల్‌లోని గ్యాస్ సిలిండర్‌కున్న పైపులో లీకేజీ కావడంతో నిప్పంటుకుని గుడిసె తగలబడగా పక్కనున్న వారు స్పందించి సకాలంలో మంటలను ఆర్పడంతో పెద్ద ప్రమాదం తప్పింది. పండగ రోజు శనివారం పిండి వంటలు చేయడానికి భార్య ప్రయత్నిస్తుండగా సిలిండర్ నుంచి పొయ్యివరకు ఉండే పైపు లూజయి గ్యాస్‌లీకేజీ కావడంతో ఉన్నట్టుండి మంటలు రేగాయి. భార్య భయపడి కేకలు వేసేలోపే గుడిసెకు నిప్పంటుకుంది. కొందరు స్పందించి పైపు లాగేసి మంటలను ఆర్పడంతో కృష్ణదంపతులకు ప్రమాదం తప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు.

విజేతలకు బహుమతి ప్రదానం

వడ్డేపల్లి, న్యూస్‌టుడే : జూలేకల్‌లో విజయదశమి సందర్భంగా ఆదివారం సాయంత్రం నిర్వహించిన స్లో బైక్ రేస్ పోటీలో ప్రథమ బహుమతి బాలరాజు, ద్వితీయ బహుమతి అనిల్ గెలుచుకున్నారు. వీరికి నిర్వాహకులు వాటిని అందజేశారు.

బాస్కెట్‌బాల్ జట్టు పయనం


ఎంపికైన సీనియర్స్ బాస్కెట్‌బాల్ జట్టుతో సంఘం సభ్యులు

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లా సీనియర్స్ జట్టు పయనమైంది. ఆదివారం జిల్లా కేంద్రంలో డీఎస్‌ఏ మైదానంలో ఎంపికైన జట్టుకు సంఘం జిల్లా అధ్యక్షుడు జాకెర్ క్రీడాదుస్తులు అందజేశారు. పోటీల్లో సత్తా చాటి విజయం అందుకోవాలని ఆకాంక్షించారు. రాష్ట్రస్థాయి పోటీలు హైదరాబాద్‌లో ఈనెల 14, 15 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు వివరించారు. జిల్లా కార్యదర్శి నస్రుల్లా హైదర్, సభ్యులు పాల్గొన్నారు.

ఎంపికైన జట్టు ఇదే..: పృథ్వీరాజ్, ఎంఏ రాషద్, కె. ఉదయ్ కుమార్, అజహర్ మహబూబ్, ఎండీ సయీద్ అలీ, ఎండీ ఖాజా సల్మాన్, వి.కిరణ్ కుమార్, అలి అబ్దుల్ బాసిత్, జి. రోహిత్ కుమార్, ఎండీ జకి, రామ్మోహన్‌రెడ్డి, అబ్దుల్ రాఫె సీనియర్స్ జట్టుకు ఎంపికయ్యారు.

అవకాశాలు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చేశా

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే : అవకాశాలు సద్వినియోగం చేసుకుని నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని మాజీమంత్రి నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని నివాసంలో ఆయన జన్మదినం సందర్భంగా రూపొందించిన భాగ్యనగర్ పోస్టు ప్రత్యేక సంచిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాజా రామేశ్వర్ రావు వనపర్తి రాజు అయినప్పటికీ ఎక్కడ తన విగ్రహాలు పెట్టొద్దని వీలునామాలో ప్రస్తావించారని గుర్తు చేశారు. భాగ్యనగర్ పోస్ట్ ఎడిటర్ రాఘవరెడ్డి, కోట్ల వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల క్రీడలు.. జాతీయ స్థాయికి బాటలు


కలెక్టర్ నుంచి ప్రశంసలందుకుంటున్న నరేశ్

గద్వాల, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు క్రీడల్లో రాణిస్తున్నారు. గతంలో గణతంత్ర, స్వాతంత్ర్య దినోత్సవాల సందర్భంగా మాత్రమే పోటీలను నిర్వహించే వారు. అవి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ తదితర కొద్ది పోటీలు మాత్రమే. గ్రామీణ క్రీడాకారుల్లో ప్రతిభను వెలికి తీసి జాతీయ స్థాయికి చేర్చటమే లక్ష్యంగా క్రీడా పోటీల నిర్వహణలో రాష్ట్ర విద్యాశాఖ, పలు మార్పులకు శ్రీకారం చుట్టింది. పాఠశాలల పరిధిలో వయస్సు ఆధారంగా విద్యార్థులకు వివిధ క్రీడలను నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో కొందరు విద్యార్థులు భిన్నమైన క్రీడలను ఎంపిక చేసుకొని రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎదుగుతున్నారు. ధరూరు, పాతపాలెం ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఇలా ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు.


రాఘవేంద్ర

రగ్బీలో..: ధరూరు ఉన్నత పాఠశాలలో 8 తరగతి చదువుతున్న నరేశ్ పిట్ట కొంచెం కూత ఘనం అన్నట్టు అండర్ 14 విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లోనూ రాణించి ప్రశంసలందుకున్నాడు. నిరుపేద కుటుంబం నుంచి వచ్చి తాను ధరూరు బీసీ వసతిగృహంలో ఉండి చదువుకుంటూ భిన్నమైన క్రీడలో జాతీయ స్థాయికి ఎదగటంపై పీఈటీ శ్రీనివాసులు, పాఠశాల హెచ్ఎం ప్రతాపరెడ్డి ప్రోత్సాహం ఉందని అంటున్నాడు. అదే పాఠశాలలో చదువుతున్న రాఘవేంద్ర అండర్-17 విభాగంలో జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. జాతీయ క్రీడాకారులుగా చిన్న వయస్సులోనే కలెక్టర్ నుంచి ప్రశంసలు అందుకోవటం సంతోషంగా ఉందని వారంటున్నారు.


తరుణ్.. రాఘవేంద్ర

షూటింగ్ బాల్‌లో..: పాతపాలెం ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న తరుణ్, రాఘవేంద్ర షూటింగ్ బాల్ క్రీడపై మక్కువ పెంచుకొని క్రీడా శిక్షకుల సహకారంతో జాతీయ స్థాయికి ఎదిగారు. గద్వాల జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఇద్దరూ కరీంనగర్‌లో జరిగిన పోటీల్లో జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. వచ్చే నవంబరు 29న బిహార్‌లోని బుద్ధగయలో నిర్వహించే జాతీయ స్థాయి అండర్-17 పోటీల్లో పాల్గొంటున్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు జాతీయ స్థాయిలో గుర్తింపు రావటానికి పాఠశాలల క్రీడా పోటీలు బాటలు వేస్తున్నాయని విద్యార్థులు చెబుతున్నారు. దీనికి తోడు ఫిజికల్ డైరెక్టర్ మోహన్, పీఈటీ విజయ్ వర్మ, హెచ్ఎం చంద్రసేనారెడ్డి సహకారం కూడా ఉందని వారంటున్నారు. జాతీయ స్థాయిలోనూ రాణించి పాఠశాలకు సొంత గ్రామాలకు పేరు తీసుకురావడమే తమ లక్ష్యమని వీరు పేర్కొంటున్నారు.

ఆది శిలాక్షేత్రం భక్తజన సందోహం



దేవదేవుని పల్లకిలో ఊరేగిస్తున్న వాల్మీకి పూజారులు.. ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

మల్దకల్, న్యూస్‌టుడే: విజయదశమి పర్వదినం శనివారం కలిసి రావడంతో మల్దకల్ ఆది శిలాక్షేత్రానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకుని ఉత్సాహంగా మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ, గోపూజ, శాంతిహోమం, పంచామృతాభిషేకం, అలంకరణ, మంగళహారతి నిర్వహించారు. సాయంత్రం రథోత్సవం, పల్లకీసేవ, ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, శమీవృక్షం పూజ, పవళింపు సేవను నిర్వహించారు. ఈసందర్భంగా గద్వాల సీఐ నాగేశ్వరరావు, తెదేపా మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

కుక్కకాటు గొర్రెలకు టీకాలు

వడ్డేపల్లి, న్యూస్‌టుడే: జూలేకల్ శివారు ఉత్తరాపుడ్ సమీపంలో కుక్కకాటుకు గురైన గొర్రెలకు కంపెనీ వారు ఆదివారం టీకాలు చేయించారు. పెద్ద గొర్రెలు, పిల్లల మీద కుక్కల దాడికి కంపెనీ గేటు వద్ద శుక్రవారం రాత్రి కాపర్లు ధర్నా చేయడంతో స్పందించారని తెలిపారు. కుక్కల దాడితో గాయాలకు గురైన జీవాలకు పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది చికిత్సలు చేశారు.





బిజినేపల్లిలో పల్లకి సేవలో ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి తదితరులు.. ఉండవల్లి: దుర్గామాత విగ్రహంతో ఊరేగింపు.. రాజోలి: జనసందోహం నడుమ అమ్మవారి ఊరేగింపు.. విజ్ఞానంలో పారిశుద్ధ్య కార్మికులను సన్మానించిన ఏబీవీపీ నేతలు

వైభవంగా ముగిసిన సంబరం



దసరా పండగను శనివారం ప్రజలు ఘనంగా చేసుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ విగ్రహాలను ఊరేగించి జమ్మి చెట్టు వరకు చేరుకుని పూజలు నిర్వహించారు. అనంతరం జమ్మి ఆకును ఒకరికొకరు ఇచ్చుకుని పండగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. పట్టణాల నుంచి ప్రజలు తరలిరావడంతో గ్రామాల్లో సందడి నెలకొంది. బ్యాండు వాయిద్యాలు, నృత్యాల మధ్య అమ్మవారు, నవదుర్గాల మొలకల ఊరేగింపు వైభవంగా జరిగింది. మొలకలను నీటి వనరుల్లో నిమజ్జనం చేశారు. -న్యూస్‌టుడే బృందం





అయిజలోని అంబాభవానీ ఆలయంలో భక్తులు.. మల్దకల్: నాగర్‌దొడ్డిలో అమ్మవారి వేషధారణలో బాలిక.. మానవపాడు: అమ్మవారి ఊరేగింపులో మహిళలు, గ్రామస్థులు.. గద్వాల: ఊరేగింపులో నృత్యం చేస్తున్న మహిళలు.. గద్వాలలో దుర్గామాత ప్రతిమ

ఈ తీగ ప్రమాదాన్ని ఆపగలదా?



సుంకేసుల జలాశయానికి సందర్శకులు తాకిడి ఉంటుంది. కానీ డ్యాం వద్ద ప్రమాదకర ప్రదేశాలున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. చిత్రంలో కన్పిస్తున్న ప్రాంతంలో ఇలా రెండున్నర అడుగుల ఖాళీ ప్రదేశం ఉంది. ఇక్కడ ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా నదిలో పడిపోయే ప్రమాదం ఉంది. కేవలం సన్నటి ఇనుప తీగతో ఇలా కట్టి వదిలేశారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని డ్యాం జేఈ రాజు తెలిపారు. -న్యూస్‌టుడే, రాజోలి

వెళ్లే దారిలేక!

తనగల వీధుల్లో ఎక్కడ చూసినా నెలల తరబడి నీరు నిలిచి ఉండటం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగు వెళ్లడానికి సరైన కాలువలు లేక ఇళ్ల ముందు నుంచే పారుతోంది. వానాకాలంలో వర్షం నీరు, డ్రైనేజీ నీరు కలిసి పొంగిపొర్లుతున్నాయి. ఎస్సీకాలనీ, దద్దనం, బీసీ కాలనీ, కుర్వ, వాల్మీకి వీధుల్లో ఈ పరిస్థితి ఉంది. వీధులు పరిశీలించి నిధుల లభ్యత మేరకు చర్యలు చేపడతామని ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. -న్యూస్‌టుడే, వడ్డేపల్లి



తారు రోడ్డు నిర్మించండి సారూ..!



మల్లెందొడ్డి నుంచి ఉదండాపురం వరకున్న మట్టి రహదారితో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వానాకాలంలో వాహనాలు తిరగలేని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. ప్రస్తుతం ఎల్కూరు మీదుగా తిరిగి గ్రామాలకు చేరుకుంటున్నారు. మల్లెందొడ్డి నుంచి ఉదండాపురం వరకు తారు రోడ్డు నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ప్రతిపాదనలు పంపుతామని పీఆర్ ఏఈ బషీర్ తెలిపారు. -న్యూస్‌టుడే, మల్దకల్

ఒకే గది.. ఒకే ఉపాధ్యాయుడు



జక్కిరెడ్డిపల్లె ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు లేక ఒకే గదిలో ఐదు తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ఓ పాఠశాల నుంచి ఉపాధ్యాయుడిని అధికారులు బదిలీ చేసినా ఆయన ఇక్కడికి రావడంలేదు. విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఉపాధ్యాయుడి ఏర్పాటుకు చర్యలు చేపడతామని ఎంఈవో నర్సింహులు తెలిపారు. - న్యూస్‌టుడే, వడ్డేపల్లి

ఆలయ అభివృద్ధికి సహకరించాలని వినతి


మాజీ ఎమ్మెల్యే నరసింహులుకు వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

అయిజ, న్యూస్‌టుడే: అయిజలోని కట్టకింద తిమ్మప్పస్వామి ఆలయ అభివృద్ధికి సహకరించాలని మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులును శనివారం ఆలయ కమిటీ సభ్యులు కోరారు. విజయ దశమి సందర్భంగా ఆలయంలో మొక్కుతీర్చుకోడానికి వచ్చిన ఆలయనను కలిసి ఇక్కడున్న సమస్యలను వివరించారు. 2012లో అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయకు వస్తున్నా మీకోసం పాదయాత్రలో భాగంగా అయిజలోని కట్టకింద తిమ్మప్పస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. అప్పట్లో చంద్రబాబును కోరగా తి.తి.దే. నుంచి రూ. 35 లక్షలు మంజూరు చేయించారని ఆలయ కమిటీవారు వివరించారు. ప్రస్తుతం రూ.50 లక్షల నిధులు ఆలయ పునర్నిర్మాణానికి అవసరమని ఏపీ ముఖ్యమంత్రితో మాట్లాడి నిధులు మంజూరు చేయించేలా చూడాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.


దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోండి

మానవపాడు, న్యూస్‌టుడే: చిన్నపోతులపాడు గ్రామంలోని మహిళను దూషించి వేడినూనె పోసి దాడికి పాల్పడిన ముగ్గురిని అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆల్‌ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్సు మానిటరింగ్ కమిటీ సభ్యులు మాచర్ల ప్రకాశ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మహిళపై దాడికేసులో ఎస్సీ, ఎస్టీతో చట్టంతోపాటు హత్యాయత్నం కేసు నమోదు చేయాలని ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు ఒక ప్రకటనలో డిమాండు చేశారు.

సాయిబాబా మరణం బాధాకరం

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: విప్లవనేత ప్రొఫెసర్ సాయిబాబా మరణం బాధాకరమని ప్రజాఫ్రంట్ రాష్ట్ర కో కన్వీనర్ ప్రభాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజ్య నిర్బంధాన్ని ఎదురించి పీడిత ప్రజల విముక్తి కోసం పోరాటాలే మార్గమని నమ్మిన ఆయన సిద్ధాంతాలు స్ఫూర్తిదాయకమని తెలిపారు.

అక్రమార్కులకు అండగా అధికారులు


గువ్వలదిన్నె వాగులో నిల్వ ఉంచిన ఇసుక

ధరూరు, న్యూస్‌టుడే: కేటీదొడ్డి మండలం గువ్వలదిన్నె వంకలో ఇసుక అక్రమార్కుల సంపాదనకు వరంగా మారింది. మండలానికి చెందిన కొందరు అధికారుల అండదండలు ఆసరాగా చేసుకుని రాత్రి సమయంలో ఇసుకను అక్రమ రవాణా చేస్తూ రెండుచేతులా సంపాదిస్తున్నారు. స్థానికంగా లభిస్తున్న ఇసుకకు ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. మరోవైపు పెద్దఎత్తున ఇసుక నిల్వలు చేసి సందర్భాన్ని, అదును చూసి యథేచ్ఛగా ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నట్లు సామాజిక మాధ్యమంలో వైరల్‌గా మారింది. స్థానిక తహసీల్దార్‌ను సంప్రదించగా ఇసుక రవాణాకు ఎలాంటి అనుమతులు లేవని అక్రమ రవాణా చేసిన, ఇసుకను అక్రమంగా నిల్వచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భాజపా బలోపేతానికి కృషి


పార్టీ సభ్యత్వ నమోదు చేయిస్తున్న భాజపా నాయకులు

అయిజ, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో భాజపాను మరింత బలోపేతం చేద్దామని పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి భగత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం అయిజలోని భరత్‌నగర్ కాలనీలో పార్టీ నాయకులతో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఇంటింటికీ అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. గ్రామీణుల అభివృద్ధికి కేంద్రం చేపట్టిన పథకాల గురించి ఆయన వివరించారు. అనంతరం పార్టీ సభ్యత్వ నమోదు చేయించారు. నాయకులు ప్రదీప్ కుమార్, లక్ష్మణాచారి తదితరులు పాల్గొన్నారు.

స్నేహితురాలికి ఆర్థిక సాయం


సాయమందిస్తున్న స్నేహితులు

వడ్డేపల్లి, న్యూస్‌టుడే : వడ్డేపల్లి మండలం కొంకల జడ్పీ పాఠశాల 2006-07 బ్యాచ్ పదో తరగతి స్నేహితులు రజక శైలజకు ఇటీవల భర్త మృతి చెందడంతో ఆదివారం రూ.అరవై వేల ఆర్థిక సాయమందించి ఆదుకున్నారు. నిరుపేద కుటుంబమైన స్నేహితురాలికి భవిష్యత్తులో ఏ అవసరమున్నా సహాయం అందిస్తామని తెలిపారు. ఉపాధ్యాయుడు తిమ్మప్ప పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

మల్దకల్, న్యూస్‌టుడే: అయిజ నుంచి వెళ్లే 132 కేవీ పరిధిలోని మద్దలబండ ఫీడర్ 33 /11 కేవీలో ఏబీ స్విచ్‌మరమ్మతు, చెట్లకొమ్మల తొలగింపు చేపడుతున్నందున సోమవారం ఉదయం 8 గంటల నుంచి 11 వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ దుర్గాప్రసాద్ తెలిపారు. మద్దలబండ, నాగర్‌దొడ్డి, తాటికుంట ఉపకేంద్రాల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఉంటుందని వినియోగదారులు, రైతులు సహకరించాలని ఏఈ తెలిపారు.

ప్రభుత్వ కళాశాలలో దరఖాస్తులకు ఆహ్వానం

పాలమూరు: మహబూబ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాలలో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటికి అర్హత కలిగిన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ గోపాల్ ప్రకటనలో పేర్కొన్నారు. బోధన చేయడానికి కంప్యూటర్ సైన్స్, మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఎంపీహెచ్‌డబ్ల్యూ) కోర్సుల్లో అతిథి అధ్యాపకుల నియామకాలను చేపడుతున్నట్లు వివరించారు. బీటెక్‌లో కంప్యూటర్ సైన్స్‌లో 50 శాతం మార్కులు, బీఎస్సీ నర్సింగ్‌లో 50 శాతం మార్కులతో పాసై ఉండాలన్నారు. దరఖాస్తులను ఈ నెల 15వ తేదీలోగా కళాశాలలో సమర్పించాలన్నారు.